

పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి కంప్యూటర్లను అందజేస్తున్న కొలిన్స్ ఏరోస్పేస్ ప్రతినిధులు

ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్ల వితరణ

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో కొలిన్స్ ఏరోస్పేస్ సహకారంతో అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మజీద్‌పూర్ ప్రభుత్వ పాఠశాలకు మూడు కంప్యూటర్లను మంగళవారం అందజేశారు. సుమారు రూ.5 లక్షల విలువైన కంప్యూటర్లను అందజేసినట్లు వలంటీర్ అరవింద్ తెలిపారు. విద్యార్థుల భవిష్యత్ కోసం కంప్యూటర్లు ఎంతగానో ఉపయోగపడుతాయని ఆయన తెలిపారు. అనంతరం విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు కరుణ, శ్వేత, నవీన్, లక్ష్మీకాంత్‌రెడ్డి, రమేష్, కృష్ణ, శ్రీహరి, మహేష్, శ్రీనివాస్, వెంకటేష్, సబిత, శ్రీనివాస్, వెంకటేష్‌గౌడ్, సుదర్శన్, నాగమణి పాల్గొన్నారు.



కల్యాణమండప ప్రారంభోత్సవంలో రాఘువేంద్ర స్వామి మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థ శ్రీపాదుల స్వామి, కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలి

● రాఘువేంద్ర మఠం పీఠాధిపతి

వనస్థలిపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరు సుఖసంతోషాలతో జీవించాలని మంత్రాలయ రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థ శ్రీపాదుల స్వామి ఆశీర్వదించారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సచివాలయనగర్ కాలనీలోని రాఘవేంద్ర స్వామి మఠంలో ఏర్పాటు చేసిన కల్యాణ మండపాన్ని మంగళవారం స్వామి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ ప్రజలు భగవంతున్ని ఆశీస్సులతో సుఖసంతోషాలతో జీవించాలని దీవించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లచ్చిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



హయత్‌నగర్‌లో బోనాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవ జీవన్‌రెడ్డి

బోనాల ఏర్పాట్లను పరిశీలించిన కార్పొరేటర్

హయత్‌నగర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆదివారం హయత్‌నగర్‌లో నిర్వహించనున్న బోనాల పండగను పురస్కరించుకుని హయత్‌నగర్‌లోని పలు ఆలయాల వద్ద చేసిన ఏర్పాట్లను మంగళవారం హయత్‌నగర్ కార్పొరేటర్ నవ జీవన్‌రెడ్డి పరిశీలించారు. గ్రామంలో ఉన్న అన్ని గ్రామ దేవతల ఆలయాలను ఆయన సందర్శించారు. బోనాల పండగకు భక్తులకు ఏలాంటి ఇబ్బందులు జరగకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. ఆలయాల పరిసరాలను శుభ్రం చేయాలని శానిటేషన్ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. దేవాలయాలకు వెళ్లే మార్గాలలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు డి. శ్రీనివాస్, పలువురు పాల్గొన్నారు.



జావెలిన్‌త్రో లో ప్రతిభ కనబర్చిన విద్యార్థి రాజేష్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జావెలిన్‌త్రో లో విద్యార్థి ప్రతిభ

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జావెలిన్ త్రో లో అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి రమావత్ రాజేష్ ఉత్తమ ప్రతిభ కనబర్చాడు. సరూర్‌నగర్ స్టేడియంలో రంగారెడ్డి జిల్లా మూడె జావెలిన్ త్రో క్రీడలు జరుగుతున్నాయి. జిల్లా స్థాయి పోటీల్లో అండర్-16 బాలుర విభాగంలో విద్యార్థి రమావత్ రాజేష్ ఉత్తమ ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాడు మల్యాల యాదగిరి తెలిపారు. ఆగస్టు నెల 7వ తేదీ జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు రాజేష్ ఎంపికయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం స్కూల్‌లో రాజేష్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

హయత్ నగర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల గొడవ కారణంగా మహిళ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... నల్గొండ జిల్లా దేవరకొండ చింతపల్లి మండలం దేన్య తండా గ్రామపంచాయతీ గాసిరం తండాకు చెందిన రమావత్ శివ, భార్య సుజాత అలియాస్ దివ్య (21)తో కలిసి హయత్‌నగర్ బంజారా కాలనీలో కొంతకాలంగా నివాసముంటున్నారు. శివ ఆటో నడిపిస్తూ జీవనం సాగిస్తున్నాడు. వీరికి ఆరు నెలల పాప ఉంది. ఐదు నెలలుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి 7:30 గంటలకు ఇంట్లో ఎవరు లేని సమయంలో దివ్య ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సూసైడ్ నోట్‌రాసి వ్యాపారి అదృశ్యం

సైదాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లుగా ఆర్థిక పరిస్థితి బాగాలేదని, తీవ్ర మానసిక ఒత్తిడిలో ఉన్నానని హైదరాబాద్‌కు దూరంగా వెళ్లి ఆత్మహత్య చేసుకుంటానని, అంతిమ సంస్కారాలు చేసేందుకు కుటుంబ సభ్యులకు ఇబ్బందులు కలుగకుండా శవం ఏవరికి కనిపించదంటూ ఓ వ్యాపారి సూసైడ్ నోట్ ఫోన్‌లో రాసి ఇంటినుంచి వెళ్లిపోయాడు. సైదాబాద్‌లోని లైఫ్ స్టైల్ అపార్ట్‌మెంట్‌లో నివాసముండే దినేష్ ఆగర్వాల్(32) కుటుంబ సభ్యులతో కలిసి గుల్జార్ హౌస్‌లో వ్యాపారం నిర్వహిస్తున్నాడు. సోమవారం ఆగర్వాల్ ఫోన్ ఇంట్లో పెట్టి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఫోన్ చూడగా అందులో సూసైడ్ నోట్ రాసి ఉంది. దీంతో కుటుంబసభ్యులు సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మద్యం మత్తులో ఓ ఇంటిపై యువకుల దాడి

● వాహనాలు ధ్వంసం

సైదాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ముగ్గురు యువకులు ఓ ఇంటిపై దాడి చేసి వాహనాలు ధ్వంసం చేయడంతో మాదన్నపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఉత్తరప్రదేశ్ చెందిన మహ్మద్ రేయాన్ ఖాన్(19) కుటుంబంతో మాదన్నపేట మండివద్ద నివాసముంటూ పాప్‌కార్న్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి ముగ్గురు యువకులు రేయాన్ ఖాన్ ఇంటి అవరణలో తిరుగుతూ న్యూసెన్స్ చేయసాగారు. దీంతో వారిని వెళ్లమనగా ఆగ్రహించిన యువకులు రేయాన్ ఖాన్‌పై దాడి చేశారు. ఇంటి ముందు పార్క్ చేసిన కారు. బైక్‌లను, ఇంటి అద్దాలను రాళ్లతో ధ్వంసం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులు చరణ్, ఆకాశ్, సిద్దులపై కేసు నమోదు చేసినట్లు మాదన్నపేట ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఘటన స్థలాన్ని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ సందర్శించారు. ఇలాంటి ఘటనలు పునారావృతం కాకుండా పోలీసులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కోరారు.

హయత్‌నగర్‌లో జీఐఎస్ సర్వే ప్రారంభం

● తొలి రోజు వ్యాపార సముదాయాల సర్వే
● సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించాలి: కమిషనర్



ఓ వ్యాపార సముదాయాన్ని సర్వే చేస్తున్న అధికారులు

హయత్‌నగర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన జీఐఎస్ సర్వేను మంగళవారం హయత్‌నగర్‌లో సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య ప్రారంభించారు. తొలిరోజు డివిజన్‌లోని విజయవాడ జాతీయ రహదారిపై ఉన్న వ్యాపార సముదాయాలను, భవనాలను సర్వే చేశారు. ముందుగా జాతీయ రహదారిపైన రాఘవేంద్రనగర్ కాలనీలో ఉన్న హిరో హోండా షో రూంను సర్వేను చేశారు. డిజిటల్ మీటర్‌ను ఉపయోగించి భవనం కొలతలను తీశారు.

భవనం అనుమతి, ఆక్యూపెన్సి సర్టిఫికెటు, ప్రాపర్టీ ట్యాక్సు, వాటర్ బిల్లు, కరెంటు బిల్లు, ఇంటి యజమాని ఆధార్ కార్డు, పాన్ నంబర్, వ్యాపార సముదాయానికి చెందిన ట్రేడ్ లైసెన్స్, టాక్స్ రసీదును. ఫైర్ అనుమతి వంటి విషయాలను అడిగారు. భవన యజమాని లేక పోవడంతో మరో సారి వచ్చి పూర్తి సమాచారాన్ని సేకరిస్తామని సర్వే అధికారులు బాల సుబ్రహ్మణ్యం, అజయ్‌లు తెలిపారు. డిజిటల్ మీటర్ ద్వారా భవనం నాలుగు వైపుల కొలతలు మొత్తం నమోదు అవుతున్నాయి. రేపటి నుంచి పాత గ్రామంలో ఇంటింటి సర్వే చేయడం జరుగుతుందని తెలిపారు.

మహిళా సంఘాలకు అవగాహన

జీఐఎస్ సర్వేను పురస్కరించుకుని మంగళవారం ఉదయం హయత్‌నగర్ సర్కిల్ డీసీ తిప్పర్తి యాదయ్య, హయత్‌నగర్ కార్పొరేటర్ నవ జీవన్‌రెడ్డి వార్డు కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల మహిళలతో ప్రత్యేక సమవేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీ యాదయ్య మాట్లాడుతూ జీహెచ్ఎంసీ చేపట్టిన జీఐఎస్ సర్వే గూరించి, సర్వే ఏలా చేస్తారో అవగాహన కల్పించారు.

బాటసింగారంలో ప్రభుత్వ భూములను కాపాడండి

●జిల్లా అదనపు కలెక్టర్‌కు బీజేపీ నాయకుల వినతి



జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ శివారులోని బాటసింగారం, కొత్తగూడెం, పిగ్లీపూర్ గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రభుత్వ భూములను కాపాడాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బీజేపీ అధ్యక్షుడు బండిగారి విష్ణుగౌడ్, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డితో కలిసి మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) భూపాల్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఆయా పంచాయతీల పరిధిలోని ప్రభుత్వ, భూదాన్, లేఔట్‌లోని పార్కు స్థలాలు, అవసరాల కోసం వదిలేసిన ఖాలీ స్థలాలను పెద్ద ఎత్తున కబ్జా చేశారని తెలిపారు. ఇందులో కొత్తగూడెంకు చెందిన నార్లకొండ వెంకటేష్ అతడి బినామీలు, కొంత మంది అధికారులతో కుమ్మకై తప్పుడు పత్రాలతో లేఔట్‌లు సృష్టించి ప్లాట్లు చేసి కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని కొల్లగొట్టారని ఆరోపించారు. దీనికి తోడు నకిలీ ఇంటి నంబర్లతో రిజిస్ట్రేషన్‌లు సైతం చేయిస్తున్నారని తెలిపారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ భూములను సైతం వదలడం లేదన్నారు. ప్రభుత్వ భూముల కబ్జాపై వెంటనే విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.

ఈ విషయంపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బోసుపల్లి ప్రతాప్, పాపయ్యగౌడ్, కుమార్‌గౌడ్, శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డి రీజియన్‌లో..

ఉచిత ప్రయాణికులు 2 కోట్ల మంది

చాదర్‌ఘాట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలులోకి వచ్చిన మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ రంగారెడ్డి రీజియన్‌లో ఇంతవరకు 2 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించినట్లు రీజినల్ మేనేజర్ జె.శ్రీలత తెలిపారు. మంగళవారం ఆర్టీసీ ఎంజీబీఎస్‌లోని రంగారెడ్డి రీజినల్ మేనేజర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి రోజు రంగారెడ్డి రీజియన్‌లో 85 వేల మంది మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారని వివరించారు. రీజియన్‌లోని 8 డిపోలకు చెందిన సుమారు 7 వందలకు పైగా బస్సుల్లో మహాలక్ష్మి పథకం అమలు చేసే ఎక్స్‌ప్రెస్ బస్సులు, పల్లే వెలుగు బస్సులు 370 వరకు ఉన్నాయన్నారు.

కొత్తగా 280 బస్సులు

సంవత్సర కాలంలో రంగారెడ్డి రీజియన్‌లో 280 కొత్త బస్సులను ప్రయాణికుల సౌకర్యార్థ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆర్ఎం శ్రీలత తెలిపారు.



జె.శ్రీలత
రీజినల్ మేనేజర్

వంద బస్సులకు ప్రతిపాదనలు

ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్న మహిళల రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపేందుకు కొత్తగా వంద బస్సులకు ప్రతిపాదించగా పరిశీలనలో ఉన్నట్లు ఆర్ఎం తెలిపారు.

దూర ప్రాంతాల నుంచి బస్సులను నడుపుతూ ప్రయాణికులతో నగరానికి వచ్చే సుమారు 550 మంది ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు విశ్రాంతి తీసుకోడానికి వీలుగా మెరుగైన ఏసీ విశ్రాంతి గదులను అందుబాటులోకి తీసుకువచ్చామని మేనేజర్ శ్రీలత తెలిపారు.

కారుణ్య నియామకాలు...

కారుణ్య నియామకాలకు ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇప్పటికే 30 మందిని కండక్టర్లుగా ఎంపిక చేసి శిక్షణఇస్తున్నట్లు ఆర్ఎం తెలిపారు. మరో 20 మంది ఆర్టీసీ సెక్యూరిటీ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేసేందుకు దరఖాస్తు చేసుకున్నారని, ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకే రూ.4 లక్షల వరకు వైద్య సాయం అందించేవారని, ఇకనుంచి వలంటీర్ రిటైర్మెంట్ తీసుకున్న ఉద్యోగులకు కూడా వైద్య సాయం అందుతుందన్నారు.

మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ చైర్మన్‌గా ఎమ్మెల్యే శ్రీనివాస్ ఎన్నిక



ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు నియామకపత్రం అందజేస్తున్న సర్దార్ పుటం పురుషోత్తమరావు, తదితరులు

పంజాగుట్ట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పటేల్ అన్నారు. సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అధ్యక్షతన మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిజాం క్లబ్‌లో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా అపెక్స్ కౌన్సిల్ చైర్మన్‌గా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పటేల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం ఎమ్మెల్యేకు నియామక పత్రాన్ని కౌన్సిల్ కన్వీనర్ సర్దార్ పుటం పురుషోత్తమరావు, సభ్యులు వీరమళ్ల ప్రకాష్, పూల రవీందర్, రౌతు కనకయ్య, సి.విఠల్, మీసాల చంద్రయ్య, ఆకుల రజిత అందజేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మున్నూరుకాపులతో పాటు బడుగు, బలహీన వర్గాలు, పేదల సంక్షేమం ఉన్నతికి ప్రభుత్వపరంగానూ, వ్యక్తిగతంగానూ చేయూత అందిస్తానన్నారు. అపెక్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆగస్టు 10న కేంద్ర మాజీ మంత్రి పి.శివశంకర్ పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించాలని, ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానించారు.

కార్యక్రమంలో సభ్యులు మంగళారపు లక్ష్మణ్, ఆది విష్ణుమూర్తి, ఎస్.మల్లేష్, ఎర్ర నాగేందర్, ఊసా రఘు, అనిల్, బొమ్మ శ్రీరామ్‌చక్రవర్తి, రామారావు, పి.ఎల్.ఎస్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలిగా నాగమల్లేశ్వరి



నాగమల్లేశ్వరికి నియామకపత్రం అందజేస్తున్న చెన్నయ్య

పంజాగుట్ట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మాల మహానాడు మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలిగా డాక్టర్ మంచా నాగమల్లేశ్వరి నియమితులయ్యారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని మాల మహానాడు జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, మాల ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య ఆమెకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆగస్టు 8, 9, 10 తేదీల్లో నిర్వహించనున్న 'హలో మాల-చలో ఢిల్లీ' జంతర్ మంతర్ వద్ద ధర్నా కార్యక్రమం కరపత్రాన్ని ఆవిష్కరించారు. వర్గీకరణకు వ్యతిరేకంగా ఢిల్లీలో జరగబోయే మహాధర్నాకు మాలలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో మాల ప్రజాసంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మన్లు బూర్గుల వెంకటేశ్వర్లు, గోపోజు రమేష్, మాల మహానాడు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మతోటి పౌల్, నాయకులు కారంపూడి షైనర్‌బాబు, లక్ష్మణ్, బడుగు సాల్మన్, కందుకూరి జార్జ్, గొట్టిపాటి యోగి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఘటాల ఊరేగింపు

సైదాబాద్, జులై 30 (ఆంధ్రజ్యోతి): శ్రద్ధాబాద్ మార్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి సైదాబాద్‌లో ఘటాల ఊరేగింపును ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, అధ్యక్షుడు కె.మల్లేష్, కార్యనిర్వాహక అధ్యక్షుడు రాంకుమార్ పాల్గొన్నారు.

చంపాపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బోనాల ఘటాల ఊరేగింపు సోమవారం రాత్రి చంపాపేట, హస్తినాపురం డివిజన్‌లలో నిర్వహించారు. చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయం వద్ద జరిగిన స్వాగత వేదికలో చంపాపేటకు చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు జిట్టా సురేందర్‌రెడ్డి పాల్గొని ఘటాలకు స్వాగతం పలికారు.

ఆర్థిక లావాదేవీలతో వ్యాపారుల మధ్య వాగ్వాదం

● కొబ్బరి బొండాల కత్తితో దాడి, పరారైన నిందితుడు
● గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు



దాడిలో గాయపడిన ముసలారెడ్డి

వనస్థలిపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఆర్థిక లావాదేవీలతో కొబ్బరి బొండాల హోల్‌సేల్ వ్యాపారిపై రిటైల్ వ్యాపారి కొబ్బరి బొండాల కత్తితో దాడిచేసి గాయపరిచిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా హాలియాకు చెందిన పొందుగుల ముసలారెడ్డి(59) వనస్థలిపురం రైతు బజార్ సమీపంలో కొబ్బరి బొండాల వ్యాపారం చేసుకుంటు కుటుంబ సభ్యులతో కలిసి జీవిస్తున్నాడు. ఖమ్మంకు చెందిన వెంకట్‌రెడ్డి (52) సాహెబ్‌నగర్ సమీపంలోని గౌతమినగర్‌లో కొబ్బరి బొండాల వ్యాపారం చేసుకుంటు పెద్దఅంబర్‌పేట్‌లో కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. వనస్థలిపురం రైతు బజార్ సమీపంలో ఉన్న కొబ్బరి బొండాల షాపు నిర్వాహకుడు ముసలారెడ్డి గత నెలలో వెంకట్‌రెడ్డికి చేతి బదులుగా ఆరవై వేల నగదును ఇచ్చాడు. ఇదే క్రమంలో మంగళవారం ముసలారెడ్డి గౌతమినగర్‌లోని వెంకట్ రెడ్డి కొబ్బరి బొండాల షాపు వద్దకు వెళ్లి తనకు రావాల్సిన ఆరవై వేల నగదును ఇవ్వాలని అడిగాడు. దీంతో నీవు నాకు ఇచ్చినట్లు రుజువు ఏమైనా ఉందా అని వెంకట్‌రెడ్డి ముసలారెడ్డిని నిలదీశాడు. నా దగ్గర నీకు డబ్బులు ఇచ్చినట్లు వీడియో ఉందని ముసలారెడ్డి వెంకట్‌రెడ్డికి ఫోన్లో చూపిస్తున్న సమయంలో వెంకట్‌రెడ్డి తన షాపులో ఉన్న కొబ్బరి బొండాల కత్తితో ముసలారెడ్డి మెడపై దాడి చేశారు. దీంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయిన ముసలారెడ్డిని స్థానికులు సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న నిందితుడు వెంకట్‌రెడ్డి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.



గీతన్నల చైతన్యయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, తదితరులు

గీతన్నల చైతన్యయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అమరుల యాది పేరుతో.. గీతన్నల చైతన్య యాత్ర పోస్టర్‌ను మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్‌లో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు గీతా కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆగస్టు 2వ తేదీ నుంచి 18 వరకు గీతన్నల చైతన్య యాత్ర చేపట్టనున్నట్లు తెలపారు. ఈ యాత్రలో సమావేశాలు, అమరుల త్యాగాలు, కల్లు గీత వృత్తిలో ఉపాధి, ప్రత్యామ్నాయ మార్గాలను ప్రచారం చేస్తూ వేలాది మందికి సామాజిక చైతన్యం కల్పించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న ఈ యాత్రలో కల్లుగీత కార్మికులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు శ్రీశైలం, వర్కాల బాల్‌రాజ్, ముత్యాలు, సత్యనారాయణ, కృష్ణయ్య, కృష్ణ, లింగయ్య, శ్రీను, రాములు తదితరులు పాల్గొన్నారు.



ఎంవీఎస్ఆర్ కాలేజీ-కమ్మగూడ రోడ్డు పనులు ప్రారంభించిన మేయర్ పారిజాతారెడ్డి, కార్పొరేటర్ శ్రీధర్‌రెడ్డి

లింకు రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

● బడంగ్‌పేట్ మేయర్ పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, జూలై 30(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో లింకు రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్టు మేయర్ చిగిరింత పారిజాతనర్సింహారెడ్డి చెప్పారు. నాదర్‌గుల్ ప్రధాన రహదారిలోని ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ నుంచి విజ్ఞాన్ స్కూల్ మీదుగా కమ్మగూడ వరకు ఉన్న లింకు రోడ్డు అభివృద్ధి పనులను మంగళవారం కౌన్సిల్ బీజేపీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ తోట శ్రీధర్‌రెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ లింకురోడ్డు అందుబాటులోకి వస్తే పరిసర కాలనీలవాసులకు ఇబ్బందులు దూరమవుతాయని అన్నారు. అధికారులు రోడ్డు పనులు తొందరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ డీఈఈ జ్యోతిరెడ్డి, కార్పొరేటర్ ఇంద్రసేన, నాయకులు ఆనంద్‌రెడ్డి, అశోక్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నాదర్‌గుల్‌లోని సెయింట్ మాథ్యూస్ స్కూల్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

వేతనాలు ఇవ్వడం లేదని ఉపాధ్యాయుల నిరసన

సరూర్‌నగర్, జూలై 30(ఆంధ్రజ్యోతి): తమతో నెలల తరబడి పని చేయించుకుని వేతనాలు ఇవ్వకుండా వేధిస్తున్న బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌లోని సెయింట్ మాథ్యూస్ హైస్కూల్ ఎదుట మంగళవారం పలువురు ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ స్కూల్ గేట్ ఎదుట బైఠాయించారు. గతేడాది తాను పీటీగా విధుల్లో చేరితే కేవలం రెండు, మూడు నెలలు మాత్రమే వేతనం ఇచ్చారని, ఆ తర్వాత వేతనం అడిగితే అప్పుల్లో ఉన్నామని సాకులు చెబుతూ దాటవేశారని క్రాంతి అనే ఉపాధ్యాయుడు తెలిపాడు. తనతో పాటు మరో పది మంది ఉపాధ్యాయులకు జీతాలు ఇవ్వాల్సి ఉన్నదని ఆయన తెలిపారు. ఈ విషయమై పోలీసులకు సైతం ఫిర్యాదు చేశామని, పోలీసులు జోక్యం చేసుకోగా త్వరలోనే డబ్బు చెల్లిస్తానని చెప్పారని, తీరా ఇప్పుడు మళ్లీ ఇవ్వకుండా దాటవేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



కార్పొరేటర్ సుజాతానాయక్‌ను సన్మానిస్తున్న హస్తినాపురం నార్త్ ఎక్స్‌టెన్షన్ కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు

కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి: కార్పొరేటర్

చంపాపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని నార్త్ ఎక్స్‌టెన్షన్ కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ సుజాతా నాయక్ అన్నారు. కాలనీలో ఇటీవల ఎన్నికైన కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు మంగళవారం కార్పొరేటర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రం కార్పొరేటర్‌కు అందజేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ప్రజల ఇబ్బందులను తొలగించనున్నట్లు అన్నారు. నూతన అధ్యక్షుడితో పాటు కార్యవర్గ సభ్యులను కార్పొరేటర్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌యాదవ్, ఉపాధ్యక్షుడు పర్వత్‌కుమార్ యాదవ్, కోశాధికారి కొండల్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు జగదీశ్వర్‌రెడ్డి, భరత్‌రెడ్డి, తులసీరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

పేట్‌బషీరాబాద్, జూలై 30(ఆంధ్రజ్యోతి): కళ్లు కనపడటం లేదనే మనస్తాపంతో ఓ వ్యక్తి చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పేట్‌బషీరాబాద్ అడ్మిన్ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలో నివాసం ఉంటున్న బాలరాజు(43) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటీవల కళ్లు సరిగా కనిపించకపోవడంతో ఏ పని చేయలేక పోతున్నాననే మనస్తాపానికి గురైన బాలరాజు మంగళవారం ఉదయం గుండ్ల పోచంపల్లి చెరువులో దూకాడు. గమనించిన స్థానికులు చెరువులోకి దూకి కాపాడే ప్రయత్నం చేసినా అప్పటికే బాలరాజు మృతి చెందాడు. పేట్‌బషీరాబాద్ పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

గంజాయి సేవిస్తున్న ముగ్గురి అరెస్టు

కేపీహెచ్‌బీకాలనీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మూసాపేట్ మెట్రో స్టేషన్ పక్కన పాడుపడ్డ భవనంలో మంగళవారం గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను కూకట్‌పల్లి పోలీసులు అరెస్టు చేశారు. వారు లింగారెడ్డి, తన్నీరు మహేందర్, కొమ్ము రాకేశ్‌లుగా గుర్తించి వారి నుంచి 100 గ్రాములు చొప్పున ఉండే 12 గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు.